క్లుప్తంగా

8 మంది రౌడీషీటర్లపై బైండోవర్ కేసు

పెనమలూరు: మండలంలో 8 మంది రౌడీషీటర్లపై పోలీసులు సోమవారం బైండోవర్ కేసులు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వాసంశెట్టి శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం రౌడీషీటర్లు అనుమానాస్పదంగా సంచరిస్తుండటంతో వారి కదలికలపై నిఘా ఉంచి వారిపై బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. తాడిగడపకు చెందిన పి.శ్రీధర్, పామర్తి మణికంఠ, కన్నా సునీల్, షేక్ సంధాని, సనత్‌నగర్‌కు చెందిన ఎండి సర్వర్, యనమలకుదురుకు చెందిన బి.వెంకటనందకృష్ణ, జి.దుర్గానాగప్రసాద్, సజ్జా ప్రకాశరావులపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్టు తెలిపారు.

మండల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు మృతి



పెనమలూరు: మండల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు రాచూరి ఆంజనేయులు (52) సోమవారం మృతి చెందారు. ఆయన గత కొద్దికాలంగా కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. ఆయన యనమలకుదురు పాత పంచాయతీ కార్యాలయం సమీపంలో ఉంటూ, శ్రీ వాసవి జనరల్ స్టోర్స్ నడుపుతున్నారు. ఆంజనేయులు మృతి పట్ల ఆర్యవైశ్య సంఘం నాయకులు ప్రగాఢ సంతాపం తెలిపారు. రాచూరికి ఘన నివాళులు అర్పించి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.

హ్యాండ్‌బాల్ జిల్లా జట్టుకు ఎంపిక



గన్నవరం: రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు గన్నవరానికి చెందిన ఇరువురు క్రీడాకారులు ఎంపికైనట్లు నియోజకవర్గ క్రీడల సమన్వయకర్త ధనియాల నాగరాజు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. విజయవాడలోని పటమట జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయిలో అండర్-14, 17 బాలబాలికల హ్యాండ్‌బాల్ క్రీడాకారుల సెలక్షన్స్ నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు అండర్-17లో గన్నవరానికి చెందిన డి.నాగప్రత్యూష, అండర్-14లో జి.నాగఅజయ్ ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 29 నుంచి 1వ తేదీ వరకు తెనాలిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో ఇరువురు క్రీడాకారులు జిల్లా జట్లకు ప్రాతినిధ్యం వహించనున్నట్లు వివరించారు.

వినియోగదారులకు మెరుగైన సేవలే లక్ష్యం



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న విద్యుత్ శాఖ చీఫ్ జనరల్ మేనేజర్ సుబ్బారావు

ఉయ్యూరు: వినియోగదారులకు మెరుగైన సేవలే లక్ష్యంగా బాధ్యతతో పనిచేయాలని ఏపీసీపీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ దేవరకొండ సుబ్బారావు అన్నారు. స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో విద్యుత్ శాఖ ఉయ్యూరు డివిజన్ స్థాయి అంతర్గత సమీక్ష సమావేశం సోమవారం నిర్వహించారు. ట్రాన్స్‌ఫార్మర్లు, ఆపరేషన్, రెవెన్యూ విభాగాల నిర్వహణ, డేటా విజిలెన్స్, ఆయా సబ్‌స్టేషన్‌ల పరిధిలోని సమస్యలు, పరిష్కారాలపై అంశాల వారీగా సమీక్షించారు. చీఫ్ జనరల్ మేనేజర్ సుబ్బారావు మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించాలన్నారు. సమస్యలను అధిగమించి ప్రజల మన్ననలు పొందాలన్నారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలన్నారు. ఎప్పటికప్పుడు ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్‌స్టేషన్‌ల నిర్వహణ సక్రమంగా ఉండాలని సూచించారు. లో ఓల్టేజీ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులకు ఇచ్చే విద్యుత్ సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జగనన్న లే అవుట్‌లలో విద్యుదీకరణ వేగంగా జరగాలన్నారు. బకాయిల వసూళ్లపైనా ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని ఆదేశించారు. సమావేశంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు డి.కృష్ణనాయక్, రవికిషోర్, పలువురు డీఈలు, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు చేతిరాతను మెరుగుపరుచుకోవాలి

కమిషనర్ ప్రకాశరావు



పోరంకిలో విద్యార్థులకు చేతిరాత పుస్తకాలు అందజేస్తున్న కమిషనర్ ప్రకాశరావు

పెనమలూరు: విద్యార్థులు బాల్యం నుంచే తమ చేతిరాతను మెరుగుపరుచుకోవాలని తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ ఎస్.ప్రకాశరావు అన్నారు. విజయవాడ క్రెడాయ్ ఆధ్వర్యంలో పోరంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 3వ తరగతి నుంచి 6వ తరగతి చదువుతున్న విద్యార్థులకు చేతిరాతకు సంబంధించి తెలుగులో 5, ఇంగ్లిషు 5 నోట్ పుస్తకాలు 300 మంది విద్యార్థులకు సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న కమిషనర్ ప్రకాశరావు మాట్లాడుతూ ఎంత చదివినా పరీక్ష రాసే సమయంలో చేతిరాత బాగుంటేనే మంచి మార్కులు వస్తాయన్నారు. కార్యక్రమంలో క్రెడాయ్ రాష్ట్ర అధ్యక్షుడు రమణారావు, విజయవాడ అధ్యక్షుడు డి.రాంబాబు, ట్రెజరర్ వంశీ, సీఎస్ఆర్ కన్వీనర్ సి.సతీష్, విద్యాదాత కిలారు శివకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులకు దుస్తులు పంపిణీ



చోడవరంలో పంచాయతీ కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న సర్పంచి కాకర్ల వెంకటరత్నం

పెనమలూరు: చోడవరం గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న కార్మికులకు సోమవారం దుస్తులు పంపిణీ చేశారు. గతంలో చోడవరం గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన బొమ్మసాని శ్రీనివాసరావుకు ఇటీవల ఈవోపీఆర్డీగా ఉద్యోగోన్నతి వచ్చింది. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీలో సిబ్బందికి, గ్రామస్తులకు భోజనాలు ఏర్పాటు చేశారు. చోడవరం పంచాయతీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది 19 మందికి తన ఖర్చులతో దుస్తులు, స్వీట్ ప్యాకెట్ ఇచ్చారు. చోడవరం సర్పంచి కాకర్ల వెంకటరత్నం చేతుల మీదుగా దుస్తులను కార్మికులకు పంపిణీ చేశారు. మండల పరిషత్ ఏవో లోయ శివశంకర్‌రావు, ఈవోపీఆర్డీ కోరా శ్రీనివాసరావు, మండల పరిషత్, గ్రామ పంచాయతీ ఉద్యోగులు పాల్గొన్నారు.

పంపిణీకి సిద్ధంగా ఆయుష్మాన్ భారత్ కార్డులు



ఆయుష్మాన్ భారత్ కార్డు

పెనమలూరు: పెనమలూరు మండలంలోని ఆరు గ్రామాల్లో ఆయుష్మాన్ భారత్ ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన, డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ఆరోగ్య సంరక్షణ కార్డులు మొదటి విడతలో పంపిణీకి అధికారులు సిద్ధం చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలులోకి తీసుకు వచ్చిన ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కార్డులతో రూ.5 లక్షల పరిమితితో వైద్యం చేసుకోవటానికి అవకాశం ఉంటుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తారు. మొదటి దశగా మండలంలో ఆరు గ్రామాలకు మొత్తం 3,498 ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కార్డులను పంపిణీకి సిద్ధం చేశారు. వణుకూరులో 2,850, పెనమలూరులో 216, పెదపులిపాకలో 72, గోసాలలో 144, గంగూరులో 144, చోడవరంలో 72 కార్డుల చొప్పున పంపిణీ చేయనున్నారు. అర్హులైన మిగతా వారికి కూడా త్వరలో ఆయుష్మాన్ భారత్ కార్డులు పంపిణీ చేస్తారు.

రెజ్లింగ్ పోటీల్లో విజేతలకు అభినందన



రెజ్లింగ్ విజేతలతో హెచ్ఎం అనిత

ఉంగుటూరు: రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో ఉంగుటూరు జిల్లా పరిషత్ విద్యార్థులు రజిత, కాంస్య పతకాలు సాధించిన ద్యార్థుల అభినందన సభ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం అనిత మాట్లాడుతూ విజయవాడ రూరల్ మండలం నున్న వికాస్ కాలేజీలో ఈ నెల 21 నుంచి 23వ వరకు జరిగిన రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో 57 కేజీల విభాగంలో ఎస్.కీర్తన రజతం, 53 కేజీల విభాగంలో వై.నందిని, 46 కేజీల విభాగంలో ఓ.సుధారాణి కాంస్య పతకాలను సాధించారని వివరించారు. విద్యార్థులకు శిక్షణనిచ్చిన వ్యాయమ ఉపాధ్యాయురాలు క్రాంతిని, క్రీడాకారులను పాఠశాల సిబ్బంది అభినందించారు.

119 మంది విద్యార్థుల రక్తదానం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

ఉంగుటూరు: ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేయడం వరంలా భావించాలని ప్రిన్సిపాల్ జీవీకేఎస్వీ ప్రసాద్ అన్నారు. తేలప్రోలు ఉషారామ ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఆంధ్రా హాస్పిటల్స్ సౌజన్యంతో రక్తదాన శిబిరం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ అపోహలు వీడీ ప్రతి ఒక్కరూ ఆపదలో ఉన్నావారికి రక్తదానం చేసీ ప్రాణదాతలు కావాలని ఆకాంక్షించారు. ఈ శిబిరంలో 119 మంది విద్యార్థులు, అధ్యాపకులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అచ్యుత్‌బాబు, ఆసుపత్రి సిబ్బంది, పాల్గొన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వి.శ్రీహరిబాబు కార్యక్రమాన్ని సమన్వయం చేశారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



విజేతలకు బహుమతులు అందిస్తున్న జెడ్పీటీసీ బాకీ బాబు, ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి

కంకిపాడు: చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి అన్నారు. మండలంలోని కోలవెన్ను జెడ్పీ పాఠశాలలో క్రీడల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు శరవణ ఇన్‌ఫ్రా (విజయవాడ) డైరెక్టర్ మూల్పూరి సతీష్ వితరణతో సోమవారం బహుమతులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు-నేడు ద్వారా అభివృద్ధికి శ్రీకారం చుట్టారన్నారు. విద్యా విధానంలో తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులతో విద్యాప్రమాణాలు పెంపొందాయన్నారు. విద్యతో పాటు ప్రభుత్వం క్రీడలను కూడా ప్రోత్సహిస్తోందని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ సీహెచ్ సురేష్‌కుమార్, ఉపసర్పంచ్ కంచర్ల వెంకటరావు (చిన్ని), మాజీ సర్పంచ్ టెక్కెం సతీష్‌కుమార్, మాజీ ఉపసర్పంచ్ కంచర్ల శేషగిరి,దుర్గగుడి ట్రస్టు బోర్డు మాజీ సభ్యుడు నెరుసు సతీష్, ఇన్‌చార్జి హెచ్ఎం రాంబాబు, కొలుసు లక్ష్మణ్, వ్యాయామ ఉపాధ్యాయిని సీహెచ్ సుశీల పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

గన్నవరం: ఐసీడీఎస్ గన్నవరం ప్రాజెక్ట్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల పోస్టుల భర్తీకి రోస్టర్ ప్రకారం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ పి. వెంకటలక్ష్మి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. గన్నవరం మండలంలోని మెట్లపల్లిలో అంగన్‌వాడీ కార్యకర్త (ఓపెన్ కేటగిరి), కేసరపల్లి అంగన్‌వాడీ కేంద్రం-5లో సహాయకురాలు (ఓసీ) దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. బాపులపాడు మండలంలో సహాయకుల పోస్టులు వీరవల్లి-6 (ఎస్సీ), సింగన్నగూడెం (ఓసీ), బాపులపాడు-4(బీసీ-బీ) దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 2023 జూలై 1వ తేదీ నాటికి 21 నుంచి 35 ఏళ్ల వయస్సు కలిగి, పదవ తరగతి ఉత్తీర్ణులై, స్థానికులైన వివాహితలు అర్హులు. అక్టోబర్ 5వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తుతో పాటు గెజిటెడ్ అధికారులతో అటెస్టెడ్ చేసిన విద్యార్హత, వయసు, కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, రేషన్ జిరాక్స్‌లను జతపరచాలని సూచించారు.

కంకిపాడు ప్రాజెక్టు పరిధిలో...

కంకిపాడు: ఐసీడీఎస్ కంకిపాడు ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు సీడీపీఓ కె.బి.సుకన్య తెలిపారు. ఆమె సోమవారం విలేకరులతో మాట్లాడుతూ కంకిపాడు మండల పరిధిలో మినీ అంగన్‌వాడీ కార్యకర్త ఉప్పలూరు-5 (ఓసీ), అంగన్‌వాడీ సహాయకురాలు కంకిపాడు-1 (బీసీ-ఏ), ఈడుపుగల్లు-4 (బీసీ-బి), పెనమలూరు మండలంలో అంగన్‌వాడీ సహాయకురాలు కానూరు-8 (ఓసీ), వణుకూరు-3 (ఎస్సీ), గోసాల-1 (ఓసీ), యనమలకుదురు-18 (ఓసీ), యనమలకుదురు-21 (ఓసీ)కి రిజర్వు అయ్యాయన్నారు.

డప్పు కళాకారుల సమస్య పరిష్కరించాలి

గన్నవరం: చర్మ, డప్పు కళాకారుల పింఛన్ల మంజూరులో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాచేటి మురళి అధికారులకు విజ్ఞప్తి చేశారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ సత్యకుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మురళీ మాట్లాడుతూ చర్మ, డప్పు కళాకారులు ఆధార్ కార్డుల్లో తప్పుగా నమోదైన వయస్సును పాఠశాల టీసీల ద్వారా సవరించుకుంటే సచివాలయాల్లో అభ్యంతరాలు తెలుపుతున్నారని చెప్పారు. ఈ సమస్యను అధికారులు త్వరితగతిన పరిష్కరించి అర్హులకు న్యాయం చేయాలని కోరారు. సంఘ నాయకులు దేవరపల్లి దాసు, జంపన రామారావు, వడ్లమూడి రవి, మంతెన రమేష్ పాల్గొన్నారు.

ఈ క్రాప్ నమోదుకు గడువు పెంపు

గన్నవరం రూరల్: పంటల ఈ క్రాప్ నమోదు ప్రక్రియను ఈనెల 30వ తేదీ వరకూ ప్రభుత్వం పొడిగించినట్లు మండల వ్యవసాయాధికారి ఎస్ఎల్.తేజశ్వి చెప్పారు. సోమవారం మాట్లాడుతూ ఈ అవకాశాన్ని సాగుదారులు వినియోగించుకోవాలన్నారు. పంట నమోదు పూర్తి అయిన రైతులు తమ వివరాలను సోషల్ ఆడిట్ ద్వారా తెలుసుకోవాలన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో ఈ సోషల్ ఆడిట్ గ్రామ సభలు అక్టోబరు 5వ తేదీ నుంచి 10వ తేదీ వరకూ జరుగుతాయని చెప్పారు. సోషల్ ఆడిట్‌లో వచ్చే అభ్యంతరాలు అక్టోబరు 11 నుంచి 14వ తేదీ వరకూ పరిశీలిస్తామన్నారు. అక్టోబరు 16వ తేదీన పూర్తిగా పరిశీలించిన వివరాల జాబితా ఆర్‌బీకేలలో ప్రదర్శిస్తామన్నారు.

ముమ్మరంగా ఆరోగ్య సురక్ష సర్వే

గన్నవరంరూరల్: మండలంలోని గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే సోమవారం ఆరోగ్య సిబ్బంది ముమ్మరంగా నిర్వహించారు. మాదలవారిగూడెం, గొల్లనపల్లి, వీరపనేనిగూడెం గ్రామాల్లో ముస్తాబాద, ఆత్కూరు పీహెచ్‌సీలకు ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి బీపీ, షుగర్ వంటి పరీక్షలు నిర్వహించి నమోదు చేశారు. ప్రతి వ్యక్తి ఆరోగ్యం కాపాడేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందని మండల వైద్యాధికారి డాక్టర్ ఆనంద్‌బాబు చెప్పారు. వైఎస్సార్ ఆరోగ్య శ్రీ సేవలపై విస్తృత అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు.

హైస్కూల్‌కు మైక్‌సెట్ బహూకరణ

ఉంగుటూరు: తేలప్రోలులో భీమవరపు కృష్ణమోహనరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రూ.25 వేల విలువైన మైక్ సెట్‌ను గుంటక రామకృష్ణారెడ్డి కుమారుడు పూర్వ విద్యార్థి శ్రీనివాసరెడ్డి బహూకరించారని హెచ్ఎం వేలూరి వెంకటఆదిలక్ష్మి తెలిపారు. మైక్ సెట్ అందజేసిన దాతకు పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ డి.శ్రీనివాసరెడ్డి, హెచ్ఎం, పాఠశాల సిబ్బంది కతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా ప్రపంచ ఫార్మసిస్ట్ దినోత్సవం

నున్న(విజయవాడరూరల్): నున్న వికాస్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫార్మసీ విభాగాధిపతి డాక్టర్ లోకిరెడ్డి మోహన్‌కృష్ణ మాట్లాడుతూ ఫార్మారంగం మందుల తయారీలో పరిశోధన, కమ్యూనిటీ ఫార్మా రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. కరోనా సమయంలో ఫార్మసిస్టులు సేవాభావంతో ఎంతో కృషి చేశారన్నారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ పి.ఎస్.శ్రీనివాస్ మాట్లాడుతూ కరోనా సమయంలో అతి తక్కువ సమయంలో వ్యాక్సిన్ అందించడంలో ఫార్మసిస్టులు చాకచక్యంగా పనిచేశారని పేర్కొన్నారు. కళాశాల అకడమిక్ డైరెక్టర్ నరెడ్ల కీర్తి, డాక్టర్ సాయిరామ్ రెడ్డి, కళాశాల కరస్పాండెంట్స్ నరెడ్ల సత్యనారాయణరెడ్డి, అధ్యాపక బృందం పాల్గొన్నారు. తొలుత ర్యాలీ నిర్వహించారు.

సోషల్ మీడియాలో పోస్టులపై ఫిర్యాదు



జంక్షన్ ఎస్ఐ-2 టి.తిరుమలరావుకు ఫిర్యాదుచేస్తున్న ఎంపీపీ నగేష్, వైఎస్సార్ సీపీ నాయకులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: సోషల్ మీడియా వేదికగా గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీపై తప్పుడు ప్రచారం చేస్తూ, వర్గ విభేదాలు రెచ్చగొట్టేలా వ్యవహరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని బాపులపాడు ఎంపీపీ యర్రగొర్ల నగేష్, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి హనుమాన్‌జంక్షన్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. వైఎస్సార్ సీపీని వీడి టీడీపీలో చేరిన యార్లగడ్డ వెంకట్రావు అమాయకపు కార్యకర్తల్లో కుట్రపూరితంగా విషబీజాలు నాటి, వర్గ వైషమ్యాలు రగిలించాలని చూస్తున్నారని నగేష్ ఫిర్యాదులో పేర్కొన్నారు. గన్నవరం వైఎస్సార్ సీపీ పేరిట ఫేస్‌బుక్, వాట్సాప్, యూట్యూబ్, ట్విట్టర్ వంటి సోషల్ మీడియాల్లో ఫేక్ ఐడీలు సృష్టించి ఎమ్మెల్యే వంశీ, పార్టీ నాయకులపై దుష్ప్రచారం చేస్తున్నారని చెప్పారు. ఇలాంటి వ్యక్తులపై కేసులు నమోదు చేసి, చర్యలు తీసుకోవాలని హనుమాన్‌జంక్షన్ ఎస్ఐ-2 టి.తిరుమలరావుకు విజ్ఞప్తి చేశారు. ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్ నక్కా గాంధీ, వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఆవిర్నేని శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీటీసీ సభ్యుడు చాకిరి వెంకట నారాయణ, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు షేక్ తానీషా, పీఏసీఎస్ చైర్మన్ మూల్పూరు ప్రభుకాంత్, మాజీ చైర్మన్లు యర్రంశెట్టి రామాంజనేయులు, గూడవల్లి సుధాకర్, కొల్లి బ్రహ్మారావు, పుట్టా మదన్‌మోహన్, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొమరవల్లి కిరణ్‌మూర్తి, పార్టీ నాయకులు చందు నరేంద్ర, పండు నాగార్జున, గంధం రామారావు, నన్నపనేని చలపతిరావు పాల్గొన్నారు.

జై బోలో గణేష్ మహరాజ్‌కీ



కంకిపాడులో వినాయక ఊరేగింపు మహోత్సవంలో నాయీబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు

కంకిపాడు: వినాయక నిమజ్జనోత్సవాలు ఊరూరా ఘనంగా జరిగాయి. మండల కేంద్రమైన కంకిపాడులో రెండు, పునాదిపాడులో ఒక విగ్రహం ఊరేగింపు వేడుకలు సోమవారం నిర్వహించారు. నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో లాకురోడ్డు నుంచి ప్రధాన గ్రామం మీదుగా ఊరేగింపు మహోత్సవం వైభవంగా సాగింది. ఉత్సవ నిర్వహణకు సహకరించిన దాతలను సంఘ ప్రతినిధులు సత్కరించారు. ఊరేగింపు మహోత్సవాలను ఎస్ఐ కె.సుధాకర్ పర్యవేక్షించారు. ఉప్పలూరు గ్రామంలోని వేల్పూరు రోడ్డు కూడలిలో ఏర్పాటుచేసిన వినాయక మండపంలో భక్తులు స్వామి వారికి విశేష పూజలు జరిపించారు

ఘనంగా నిమజ్జన వేడుకలు

గన్నవరం: మండలంలోని పలు గ్రామాల్లో గణపతి మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. దావాజిగూడెంలో జరుగుతున్న శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఉత్సవాల్లో భాగంగా సోమవారం నిమజ్జన వేడుకలు నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన మినీ ట్రాక్టర్‌పై స్వామి వారిని గ్రామ వీధుల్లో ఊరేగించి ఏలూరు కాలువలో నిమజ్జనం చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. దావాజిగూడెంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో గణనాథుడికి వివిధ రకాల పుష్పాలతో అలంకరణలు చేశారు. గన్నవరంలోని పలు ప్రాంతాల్లో గణపతి ఉత్సవాలు కొనసాగుతున్నాయి.



కానూరులో వినాయక ఉత్సవాలలో పాల్గొన్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

పెనమలూరు: కానూరు, తాడిగడప ప్రాంతాల్లో సోమవారం జరిగిన వినాయకుడి ఉత్సవాలలో ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి పాల్గొన్నారు. కానూరు మురళీనగర్‌లో సోమవారం రాత్రి జరిగిన వినాయకుడి పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.పెనమలూరు పల్లిపేటలో సోమవారం రాత్రి 101 శివలింగాల పూజ, ఏకవార రుద్రాభిషేకం ఘనంగా చేశారు.

వాహన పూజ రుసుము పెంపు ప్రతిపాదన

హనుమాన్‌జంక్షన్ రూరల్: హనుమాన్‌జంక్షన్‌లోని ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో వాహనపూజ నిమిత్తం వసూలు చేసే రుసుము పెంచేందుకు ప్రతిపాదించినట్లు ఆలయ పాలక మండలి చైర్మన్ నెరుసు భూషణం, కార్యనిర్వహణాధికారి కూచిపూడి శ్రీనివాస్ సోమవారం తెలిపారు. ప్రస్తుతం ద్విచక్రవాహన పూజకు రూ.25గా ఉన్న టిక్కెట్ ధరను రూ.100లకు పెంచేందుకు ప్రతిపాదించినట్లు చెప్పారు. త్రిచక్ర, నాలుగు చక్రాల వాహన పూజ టిక్కెట్ ధరను రూ.50 నుంచి రూ. 200 పెంచేందుకు, నాలుగు చక్రాలు పైబడిన వాహనాలకు పూజ టిక్కెట్ ధరను రూ.300 ప్రతిపాదించినట్లు తెలిపారు. ఈ మేరకు వాహన పూజ రుసుముల పెంపుపై ఏవైనా అభ్యంతరాలు, సలహాలు దేవస్థానం కార్యాలయంలో తెలియజేయాలని కోరారు.